# గూడు

: రామా చంద్రమౌళి :

ఆమె యాభై ఏళ్ళ వయస్సులోనే చెదలు పట్టిన కర్రలా మారిపోయింది. కాని తన శరీరం అలా మారిపోయిన సంగతి ఆమెకు తెలియదు. ఎందుకంటే ఎన్నడూ తన ఒంటిని పరిశీలనగా చూసుకోలేదామె. అంత తీరికా, అవసరమూ ఎప్పుడూ ఆమెకు కలుగలేదు.

ఆమె పుట్టిన మరుక్షణం నుండి ఒంటరిగా బ్రతకడానికి అలవాటు బడ్డది. కాని ఈ ఒంటరితనమూ, జీవితమూ, జీవితానికి అర్థమూ ఇవేవీ తెలియవు ఆమెకు. మనిషై పుట్టినందుకు బ్రతకాలని మాత్రమే తెలుసు.

ఆమెకు డబ్బులేదు.

—అక్కరకొచ్చే మనుషులు లేరు. ఆస్తి లేదు. ప్రస్తుతం పని చేసుకునేందుకు ఒంట్లో దాప కూడా లేదు.

కాని ఆత్మాభిమానం మాత్రం ఉంది.

అందుకే ఆమె అనుకుంటూంటుంది. "తను చచ్చిపోయేలోగా బిచ్చం ఎత్తుకోకూడదని."

అదే ఆమె జీవితాశయం

అందుకే వారం రోజులకో చాప కుట్టుకుని రోడ్డుమీద కూర్చుంటుంది.

ఆమెకు ఇల్లు లేదు.

రోడ్డుకు ఓ ప్రక్కగా చెట్టు నానుకుని చిన్న గూడుంది దాన్ని గూడంటారో, గుడిసంటారో ఆమెకే తెలియదు సరే దానికే పేరున్నా అది మనిషి ఉండేందుకు అనుకూలంగా మాత్రం లేదు. ఆ గూడు పొడవు నాలుగడుగులు, ఎత్తు రెండు. దాంట్లో గట్టి ముక్కలా ముడుచుకు పడుకోవడం ఆమె కలవాటు.

ఆమెకు తన యాభైఏండ్ల జీవితాన్ని నెమరు వేసుకున్నప్పుడల్లా రెండు సంఘటనలు జ్ఞాపకమొస్తాయి.

ఓ పదేండ్లక్రితం ....

ఎవరో బంగారు పురుగులాంటి దొరసాని తన ప్రక్కనుండి నడిచిపోతూ నూరు రూపాయల నోటును పోగొట్టుకుంటే తను చూచి....

చూచి...ఆమెను పిలిచి నోటును తనందిస్తూంటే —

ఆ క్షణాన్లో .... దొరసాని చిత్రంగా కొండంత ఆశ్చర్యంగా తనవంక చూచిన ఆ చూపూ .... చూచి నవ్వుతూ ఓ ఐదు రూపాయలు ఇచ్చినరోజూ —

పోయినేడు —

ఎవరో కొల్లో వచ్చి తన గూడు ముందు ఆగి మెడలో "క్యామెరా"తో "పత్రిక" కోసం తన బొమ్మ కావాలని అడిగి ....

తనూ, తన గూడునీ "ఫోటో" తీసి నాలు రూపాయలిచ్చి నవ్వుకుంటూ వెళ్ళిన రోజూ

వాళ్లను చూచి నవ్వుతల్లా ఆమె ఎప్పుడూ అసూయ పడలేదు. సంతోష పడింది.

తనను తాను చూచి కూడా ఆమె ఎన్నో సార్లు సంతోషపడ్డది. తను బక్కపల్చటి మనిషి కాని తన బ్రతుకు బక్కకంటే హీనంగా ఉన్న సంగతి ఆమెకు తెలియదు పాపం.

ఎండ మండిపోతున్నది.

వడగాలి.... నిప్పుల మీద నుండి వస్తున్నట్టుగా ఒళ్ళు కమిలి పోయేటట్టు వీస్తోంది.

చెమట కారి కారి ఉక్కపోతతో చిత్తడివాసన వస్తున్నది. ఒంటి నిండా.

.... నావ అమ్మడంలేదు.

కడుపులో ఆకలేస్తున్నది, నరాలన్నింటిని గుప్పిట్లో పట్టుకొని లాగుతున్నట్టు బాధ, నిస్సత్తువ.

ఉహూఁ .... ఏదో ఒక పదార్థాన్ని మింగాలి. లేకుంటే చచ్చిపోయేటట్టున్నది.

కొంచెం వెనక్కి జరిగి బాసను గూడు ప్రక్కన చెట్టు చాటున పెట్టుకుని గూడు లోపలికి తలను దూర్చి చొప్పించి గిన్నెను బయటికి తీసుకుంది.

తెల్లగా చిన్న పండుకున్న అన్నం. మాడిపోయి వచ్చిడి.

ప్రక్కన రోడ్డుమీద జనం. పోతున్నారు వస్తున్నారు సైకిళ్ళు, రిక్షాలు, బస్సులు, ఎన్నో.

అన్నం కలుపుకుంది.

తన గూడుకు అల్లంత దూరాన ఆ ఇంజన్ ఎందుకు తిరుగుతున్నదో.... రోడ్డు ప్రక్కన గుంట ఉన్న చోట కంకర పోసి మళ్ళీ బాగు చేస్తున్నట్టున్నారు.... అక్కడక్కడ రోడ్డు మీద బండీలు పెట్టి రంగు రంగుల కాగితాలు కడుతున్నారు అంతా హడావిడిగా గందరగోళంగా ఉంది. మరమ్మతు జరుగుతున్న చోటికి ఎవరెవరో దొరలు జీపుల్లో వస్తూ పోతున్నారు - ఎందుకిదంతా.

— ప్చ్.... ఏమోలే....తన కెందుకూ.

నోట్లో ముద్ద పెట్టుకోబోతుండగా ఎవరో మనిషి తన ప్రక్కకొచ్చి నిల్చుంటే తలెత్తింది.

ఎదురుగా ఖాకీ బట్టలు పోలీసు కాదు.... కాని ఎవరో.

"ఏయ్ ముసల్దానా .... ఈ గూడును పీకేస్తాను. రోడ్డంతా క్లీన్ గా ఉండాలె మంత్రిగారొస్తున్నారు."

ఆమెకు అతను చెప్పిందేమీ అర్థం కాలేదు. కాని తన గుడిసెను పీకెయ్యడం మాత్రం బోధపడింది.

నోరు వణుకుతుండగా, మాట్లాడడమూ మానేసింది. కళ్ళనిండా నీళ్ళతో చూస్తోంది.

"వింటున్నావా. ఆ గిన్నెలూ గుడ్డలూ బైటికి తియ్యి"

"అయ్యా నీ కాళ్ళొక్కుత. దాన్ని పీకెయ్యద్దు నీడలేని పక్షినైపోత"

"ఏయ్, కాళ్ళొక్కేది ఏమున్నది — ఆర్డర్.... అంతే....ఊఁ ఊఁ....తియ్యి"

"అయ్యా....అయ్యా దండం బెడ్త"

ఆమె మొత్తుకుంటోంది....అరుస్తోంది... ఏడుస్తోంది....మొర పెట్టుకుంటోంది.

చిన్నగా రభస....ఏడ్పు....అల్లరి.

— ఏమిటి....ఏమిటి.

రోడ్డుమీది జనం ఒక్కరొక్కరే ఆగు

తున్నారు.

ఆమె ఏడుస్తూనే ఉంది గొడ్డులా.

పి. డబ్ల్యు. డీ. మనిషి హూంకరిస్తూనే ఉన్నాడు.

"అరే .... మంత్రివస్తే ఏమేమంటాం దయా. దారికడ్డంగా వుంటాందా. పోపీ రామా...."

"జావేదేవ్ భై .... బుడ్డీ బిచారా ...." మనిషో మాటంటున్నారు.

ఉహుఁ....లాభంలేదు.

"గుడిసె పీకేయ్యాల్సిందే." ఖాకీ బట్టల మనిషి.

రభస నడుముకు సగ్రున జీపొచ్చింది గొర్రెలమందలోకి తోడేలులా దాన్నిండా దొంలే.

ఆమె బలవంతంగా లేచి తొందరగా జీపు దగ్గరికిపరుగెత్తింది. వంగెత్తి మొత్తుకుంది, జనమూ అంటున్నారు.

నో ఇంపాజిబుల్ అరేకూలీ, ఆ గూడును పీకెయ్. దొర సిగరెట్టు కాలుస్తూ అజ్ఞాపించాడు.

అందరూ చూస్తూండగా గూడు కూలిపోయింది.

సత్తు గిన్నెల్లో తెల్లగా అన్నం... నల్లగా మట్టి.

ఆమె గుండెలు బాదుకుంటోంది.

కాని జీపుకు చెవుల్లేవు. కళ్ళలో పొగ చిమ్ముతూ దూసుకుపోయిందది.



# వచ్చింది దీపావళి

'వచ్చింది దీపావళి
దీనుల పాలిటి వెలుగని'
నగ్న సత్యాన్ని మరుగున దాచి
ముఖస్తుతిగా ఎలా పలుకను?

ఆకాశాన్నంటే ధరలతో
అదుపులేని కత్తులతో
చాలీచాలని జీతాల్తో
ముడిపడని అతుకుల బ్రతుకులతో—

దినమొక యుగంగా
బ్రతుకే ఒక పీడ కలగా
కలకాలం గడిచిపోతే
కలిమి అన్నది లేకపోగా—

కష్టించే శరీరాలకు
కడుపు మంటలే మిగులుతుంటే
చెమటోడ్చే కూలీలకు
చెట్టు చేమలు దిక్కు కాగా—

సమానత్వం సమభావం
మంటగలిసి నమసిపోయి
స్వార్థం మమకారాలు
అణువణువున నిండిపోగా—

రివాజుగ వచ్చే ఈ దీపావళి
'అభాగ్యుల చీకటి గుండెల్లో
కోటి దీప్తుల కాంతియని,
నవజీవనానికి క్రొత్త మలుపని'

నగ్న సత్యాన్ని మరుగునదాచి
ముఖస్తుతిగా ఎలా పలుకను?

— సుజాతా సుదర్శన్